నేతలు సమష్టిగా పనిచేయాలి

చిక్కడపల్లి: బీజేపీని పటిష్ట పరిచేందుకు నాయకులు, కార్యకర్తలు సమష్టిగా పని చేయాలని ఓబీసీ మోర్చా జాతీయ అధ్యక్షుడు, రాజ్యసభ ఎంపీ డాక్టర్ కె.లక్ష్మణ్ అన్నారు. సోమవారం అశోక్‌నగర్‌లో కార్పొరేటర్ పావని ఆధ్వర్యంలో రూపొందిన నూతన సంవత్సర కేలండర్‌ను ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఓబీసీ మోర్చా జాతీయ కార్యవర్గ సభ్యులు పూసరాజు, బీజేపీ సికింద్రాబాద్ పార్లమెంట్ జాయింట్ కన్వీనర్ ఎ.వినయ్‌కుమార్, డివిజన్ అధ్యక్షులు వి.నవీన్‌కుమార్‌ముదిరాజ్, సీనియర్ నాయకులు రత్నసాయిచంద్, శ్రీకాంత్, ఎం.ఉమేష్, శ్రీనివాస్, నర్సింహ, శ్రీనివాస్, ఆనంద్‌రావు, యాదగిరి, నీరజ్, సంయుక్తరాణి, కృష్ణవేణి తదితరులు పాల్గొన్నారు.

కల్యాణం.. కమనీయం

నల్లకుంట: న్యూనల్లకుంట పురవీధులు సీతారాముల నామస్మరణతో మార్మోగాయి. అఖిల భారత శ్రీరామనామ కోటిలేఖన మహా సంఘం వార్షికోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. సోమవారం 'సీతారాముల కల్యాణం' అంగరంగా వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మంగళ వాయిద్యాల నడుమ సీతారాముల ఉత్సవమూర్తులను పురవీధుల్లో ఊరేగించారు. అనంతరం వేదపండితులు సీతారామచంద్రస్వామి కల్యాణం నిర్వహించారు.

బీజాపూర్‌లో మావన హననాన్ని అడ్డుకోవాలి

ముషీరాబాద్: ఛత్తీస్‌ఘడ్ రాష్ట్రంలో బీజేపీ ప్రభుత్వం ఏర్పడినప్పటి నుంచి ఆపరేషన్ కగార్ పేరిట ఆదివాసులు, మావోయిస్టులపై కొనసాగుతున్న హత్యాకాండను సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ తీవ్రంగా ఖండించింది. ఈ సందర్భంగా రాష్ట్ర కార్యదర్శి పి.సూర్యం మాట్లాడుతూ.. ఈ హత్యాకాండ హోంమంత్రి ప్రోత్సాహంతోనే జరుగుతున్నాయని అన్నారు. ఈ మావోయిస్టు వేటలో వందలాది అమాయక ఆదివాసీలను కిరాతకంగా పొట్టన పెటుకోవడం సరైన పద్ధతి కాదన్నారు. మొన్నటి బీజాపూర్ ఎన్‌కౌంటర్ మృత్యులంతా ఆదివాసీలే అయితే వారికి మావోయిస్టు పేరు పెట్టి కాల్చి చంపారని ఆరోపించారు. ఈ హత్యాకాండను భారత రాష్ట్రపతి అడ్డుకునేలా ఆదేశాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. జీవించే హక్కును హరిస్తున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఫాసిస్టు విధానాలను ఖండించాలన్నారు.

సమాజం బాగుండాలనే ఉపవాస దీక్షలు

ముషీరాబాద్: రాంనగర్‌లోని ప్రార్థన వీరుల చర్చిలో 40 రోజుల ఉపవాస దీక్షలు సోమవారం ప్రారంభమయ్యాయి. 27 సంవత్సరాల నుంచి క్రమం తప్పకుండా ప్రతి సంవత్సరం ఎం.మెరిలీనా ఈ ఉపవాస దీక్షలను కొనసాగిస్తూ దేవుడి కృపకు పాత్రులవుతున్నారు. సంఘం, సమాజం మొత్తం బాగుండాలని ఈ దీక్షలను కొనసాగిస్తున్నట్లు తెలిపారు.

కులగణనపై పారదర్శకతను నిరూపించుకోవాలి

సుందరయ్యవిజ్ఞానకేంద్రం: కులగణన అనగారిన వర్గాల అభివృద్ధికి పునాదిగా నిలవాలని గౌడ ఐక్య సాధన సమితి రాష్ట్ర అధ్యక్షుడు అంబాల నారాయణగౌడ్ అన్నారు. సోమవారం బాగ్‌లింగంపల్లిలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. దేశంలోనే ప్రతిష్టాత్మకంగా చేపట్టిన కుల గణనపై వస్తున్న ఆరోపణల నేపథ్యంలో ప్రభుత్వ స్పందించాలన్నారు. కులగణన వివరాలను ప్రభుత్వ వెబ్‌సైట్‌లో పొందుపర్చాలని కోరారు. రాష్ట్రంలో ఏ కుల జనాభా ఎంత ఉందో? దానికి సంబంధించిన పట్టికను విడుదల చేసి పారదర్శకతను నిరూపించుకోవాలని అన్నారు. కులగణన గొప్ప కార్యక్రమం అని దాని విలువ నీరుగారకుండా విజయవంతం చేయాలన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42శాతం రిజర్వేషన్ అమలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు.

శ్మశానవాటిక ప్రహరీ నిర్మాణానికి చేయూతనివ్వాలి

అంబర్‌పేట: అంబర్‌పేట శ్మశానవాటిక ప్రహరీ నిర్మాణానికి చేయూతనివ్వాలని శ్మశానవాటిక ప్రతినిధులు బాగ్‌అంబర్‌పేట డివిజన్ కార్పొరేటర్ బి.పద్మవెంకట్‌రెడ్డికి వినతిపత్రం ఇచ్చారు. సోమవారం ఆమె కార్యాలయంలో కలిసి శ్రీరమణ థియేటర్ సమీపంలో శ్మశానవాటిక ప్రహరీ లేదని అక్కడ గోడ నిర్మాణానికి కృషి చేయాలని శ్మశానవాటిక ప్రతినిధులు యూసుఫ్ షరీఫ్, ఇతర నాయకులు వినితి పత్రం ఇచ్చారు. ప్రహరీ నిర్మాణానికి తనవంతు సహకారం అందిస్తానని కార్పొరేటర్ హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు బి.వెంకట్‌రెడ్డి, బాల్‌రాజ్ పాల్గొన్నారు.

హెబ్రోన్ చర్చికి తాళాలు వేశారనే ప్రచారాన్ని నమ్మొద్దు

చిక్కడపల్లి: గోల్కొండ క్రాస్ రోడ్డులోని ప్రపంచ ప్రసిద్ధిచెందిన హెబ్రోను చర్చిలో ప్రార్థనలు ప్రశాంత వాతావరణంలో జరుగుతున్నాయని హెబ్రోను సొసైటీ అధికార ప్రతినిధి రాగి వీరాచారి, ట్రస్ట్ అధికార ప్రతినిధి ఎం.ఇమ్మానియేల్ అన్నారు. సోమవారం చర్చిలో ఏర్పాటు చేసిన విలేకరులతో వారు మాట్లాడుతూ.. సొసైటీ, ట్రస్ట్ మధ్య నెలకొన్న వివాదాలకు ముగింపు పలుకుతూ కలసిపోవడం సంతోషంగా ఉందన్నారు. హెబ్రోన్ చర్చికి తాళాలు వేశారనే తప్పుడు ప్రచారాన్ని నమ్మొద్దని భక్తులను కోరారు. ఐదు నెలలుగా చర్చిలో నెలకొన్న పలు వివాదాలకు కారణమైన డి.రాజేశ్వర్‌రావు స్థానికులతో రూ.కోటిన్నర భక్తుల కానుకలను లెక్కాపత్రం లేకుండా చేశారన్నారు. ఆదివారం భక్తులు ఇచ్చిన కానుకలను ప్రస్తుత కమిటీ బ్యాంకు అకౌంట్లలో జమ చేసిందని తెలిపారు.

మౌలానా ఆజాద్‌నగర్‌లో..



నింబోలిఅడ్డ మ్యూనిపాల్ స్కూల్ రోడ్డులో..



శివాజీనగర్ నాలా వద్ద...



విక్రమ్‌నగర్ పార్కు వద్ద..



పర్వరీష్ బాగ్ పార్కు వద్ద..



కుద్బిగూడ రోడ్డులో...




చెప్పల్‌బజార్‌లో ట్రాన్స్‌ఫార్మర్ వద్ద



ట్రాన్స్‌ఫార్మర్ కింద చెప్పులు కుడుతున్న మహిళ





యమ డేంజర్.!

- విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ల పక్కనే ఉన్న చెత్తకుప్పలు
- కొన్నింటికి కంచెలు లేవు.. ఉన్నవి ధ్వంసం
- మూతల్లేని ఫ్యూజ్‌బాక్స్‌లు
- వేలాడుతున్న వైర్లు
- విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ల నిర్వహణ అధ్వానం
- ఫిర్యాదు చేసినా స్పందించని అధికారులు



నింబోలిఅడ్డ సమోసా పార్కు వద్ద ట్రాన్స్‌ఫార్మర్ వద్ద ఇలా..

కాచిగూడ: విద్యుత్ శాఖ అధికారుల నిర్లక్ష్యం, అలసత్వం కారణంగా కాచిగూడ డివిజన్‌లోని పలు ప్రాంతాల్లో ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ల నిర్వహణ అస్తవ్యస్తంగా మారింది. డివిజన్‌లోని శివాజీనగర్, విక్రమ్‌నగర్, పర్వరీష్ బాగ్, చెప్పల్‌బజార్, నింబోలిఅడ్డ, మౌలానా అజాద్‌నగర్ తదితర ప్రాంతాల్లో నివాసాల మధ్య రహదారికి అనుకుని ఉన్న పలు విద్యుత్ ట్రాన్సఫార్మర్ల ప్రహరీలు కూలిపోయి రక్షణ లేక ప్రమాదకరంగా మారాయి. అయినా అధికారులు స్పందించకపోవడంపై తీవ్ర విమర్శలకు దారి తీస్తోంది. దశాబ్దాల క్రితం నిర్మించిన ప్రహరీలు కూలడంతో చెత్తాచెదారం వేస్తున్నారు. అగ్నిప్రమాదం జరిగే అవకాశం ఉందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.



నింబోలిఅడ్డ మహంకాళి టెంపుల్ సమీపంలో ట్రాన్స్‌ఫార్మర్ రోడ్డుపై పేరుకుపోయిన చెత్తాచెదారం

డంపింగ్‌యార్డులను తలపిస్తూ..

◆ విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ల నిర్వహణ అధ్వానంగా మారింది. ఒకసారి బిగించిన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ల వైపు అధికారులు వాటి వైపు కన్నెత్తి కూడా చూడటం లేదనే విమర్శలు ఉన్నాయి. పలు ట్రాన్స్‌ఫార్మర్లకు కంచెలు లేకపోగా, మరికొన్ని టాన్స్‌ఫార్మర్లు చెత్త డంపింగ్‌యార్డులుగా మారాయి. కాచిగూడ డివిజన్ పరిధిలో ఇలా ఎన్నో ట్రాన్స్‌ఫార్మర్లు ఉన్నాయి. ట్రాన్స్‌ఫార్మర్ల వద్ద ఉన్న విద్యుత్ కేబుళ్లు సైతం గాలిలో వేలాడుతూ.. ప్రమాద ఘంటికలు మోగిస్తున్నాయి. దశాబ్దాల క్రితం వేసిన సిమెంట్ కంచె ధ్వంసమైపోయి ఆ ప్రాంతంలో పిచ్చి మొక్కలు పెరిగాయి. ప్రజలు తమ ఇంటిలోని వ్యర్థాలు చెత్తను తీసుకొచ్చి విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ల పక్కన పడేస్తున్నారు.

భద్రత కరువు...

నిబంధనల ప్రకారం ట్రాన్స్‌ఫార్మర్ల భద్రత ప్రజలకు ఎలాంటి హాని జరగకుండా రక్షణ కోసం ట్రాన్స్‌కో అధికారులు చర్యలు తీసుకోవాల్సి ఉంది. ట్రాన్స్‌ఫార్మర్లను ఏర్పాటు చేస్తున్న అధికారులు వాటి నిర్వహణ భద్రతను పూర్తిగా గాలికి వదిలేస్తున్నారు. విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లలో ఉండే ఆయిల్‌ను మార్చకపోవడం వల్ల తరచూ అవి పేలిపోతున్నాయని స్థానికులు అంటున్నారు. అధికారులు వెంటనే స్పందించి ట్రాన్స్‌ఫార్మర్ల చుట్టూ ప్రహరీల నిర్మాణాలు, మరమ్మతులు చేపట్టి ప్రమాదాలు జరగకుండా తగిన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

మూతలు లేని విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు..

◆ మరికొన్ని విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ల వద్ద ఫ్యూజ్ బాక్సులు ఏర్పాటు చేశారు. అవి కూడా నిర్వహణ లోపంతో ప్రమాదకరంగా మారాయి. వాటి మూతలు తెరుచుకుని ఉంటున్నాయి. పలు మార్లు వీధి జంతువులు కంచెలేని ట్రాన్స్‌ఫార్మర్లు, ఫ్యూజ్ బాక్సుల వద్దకు వచ్చి ప్రమాదాల బారిన పడ్డాయి. నింబోలిఅడ్డ, విక్రమ్‌నగర్ తదితర ప్రాంతాల్లోని విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ పరిసర ప్రాంతాల్లో చెత్త వ్యర్థాలు కుప్పలుగా పడి ఉన్నాయి.

మహిళలు ధైర్య, సాహసాలు కలిగి ఉండాలి

డాక్టర్ సముద్రాల వేణుగోపాలాచారి



డాక్టర్ సముద్రాల వేణుగోపాలాచారితో ప్రశంస పత్రాలు అందుకున్న చిన్నారులు

నల్లకుంట: మారుతున్న కాలానికి అనుగుణంగా మహిళలు ధైర్య సాహసాలు కలిగి ఉండడం ఎంతో అవసరమని కేంద్ర మాజీ మంత్రి డా. సముద్రాల వేణుగోపాలాచారి అన్నారు. శ్రీ ఆకాంక్ష చారిటబుల్ ట్రస్ట్, లాస్య నృత్యాలయం సంయుక్త ఆధ్వర్యంలో సోమవారం నల్లకుంట శంకరమఠం ప్రాంగణంలో భరత నాట్య ప్రదర్శన నిర్వహించారు. అనంతరం యువ కళావాహిణి అధ్యక్షుడు లంక లక్ష్మీనారాయణ అధ్యక్షతన జరిగిన సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన వేణుగోపాలాచారి నృత్యకారులకు ప్రశంసా పత్రాలు అందజేసి మాట్లాడారు. చిన్నారుల నృత్య ప్రదర్శనలో భారతీయ సంస్కృతి, సంస్కారం ఉట్టి పడుతుందని కొనియాడారు. అనంతరం ఆత్మీయ అతిథి ప్రముఖ న్యాయవాది కె.పార్వతి మాట్లాడారు. సమావేశం ప్రారంభానికి ముందు ప్రముఖ నృత్య గురువు విశాఖ ప్రకాష్ శిష్యులు హర్షిణి, అక్షయ, సంకీర్తన, ప్రణవి, మేధ, ఆద్య, అనఘ, మహతి, శ్రియ, నయన, రిధీమా తదితరులు తమ చక్కటి హావభావాలతో కూడిన నృత్యాలు చేసి ఆహూతులను అలరించారు. బుర్ర కృష్ణ మోహన్ వ్యాఖ్యాతగా వ్యవహరించిన ఈ కార్యక్రమంలో ఆకాంక్ష చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపకురాలు పాపర్తి సంధ్యారాణి, కన్వీనర్ రఘుశ్రీ తదితరులు పాల్గొన్నారు.

కాసాని ఐలయ్య ఆశయ సాధనకు కృషి చేస్తా

సుందరయ్యవిజ్ఞానకేంద్రం: నిరంతరం ప్రజా సమస్యలపై పోరాటం చేసిన ప్రజల మనిషి కాసాని ఐలయ్య ఆశయ సాధనకు కృషి చేస్తామని.. ఆయన పోరాటాలను కొనసాగిస్తామని గొర్రెలు, మేకల పెంపకం దారుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఉడుత రవీందర్ అన్నారు. సోమవారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో గొర్రెలు, మేకల పెంపకందారుల సంఘం గౌరవ అధ్యక్షుడు కాసాని ఐలయ్య సంస్మరణ సభ జరిగింది. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఉడుత రవీందర్ మాట్లాడుతూ... గొర్లకాపరుల పక్షాణ నిలబడి వారి సమస్యల పరిష్కారానికి కృషి చేసిన మహనీయుడు ఐలయ్య అన్నారు.

◆ వరంగల్ జిల్లాలో జన్మించి కొత్తగూడెం జిల్లాకు వలస వెళ్లి ఉమ్మడి ఖమ్మం జిల్లాలో నిరంతరం గొర్లకాపరులు ఎదుర్కొంటున్న సమస్యలపై ప్రజలను ఐక్యం చేసి పోరాడారని అన్నారు. అంతేకాకుండా ఇండ్లులేని పేదలను సమీకరించి 20వేల మందికి ఇండ్లు నిర్మాణం చేసి ఇచ్చారని గుర్తు చేశారు. వ్యవసాయం లేని ప్రజలను సమీకరించి భూపంపిణీ కోసం ఉద్యమించారని అన్నారు. వేలాది మంది గిరిజనులకు పోడు భూములకు పట్టాలు ఇప్పించారని గుర్తు చేశారు. సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కిల్లే గోపాల్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో రాష్ట్ర మాజీ అధ్యక్షుడు రావుల జంగయ్య, పగడాల యాదయ్య, కె. చంద్రశేఖర్, లింగయ్య, శంకరయ్య, బొల్లం అశోక్, ఎం.రాజు, ఆలేటి యాదగిరి, కాసాని రజిత తదితరులు పాల్గొన్నారు.



సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో కాసాని ఐలయ్య సంస్మరణ సభలో మాట్లాడుతున్న ఉదత రవీందర్

సరస్వతి నిలయం మన త్యాగరాయ గానసభ

మాజీ ఐఏఎస్ అధికారి డాక్టర్ కేవీ రమణాచారి

చిక్కడపల్లి: పదవి అనేది అధికారం చెలాయించేందుకు కాదని వారిలో సేవాభావంతో పాటు కళలు, సాహిత్యం పట్ల అభిమానం ఉంటే సమాజం గొప్పగా ఉంటుందని విశ్రాంత ఐఏఎస్ అధికారి డాక్టర్ కేవీ రమణాచారి అన్నారు. త్యాగరాయ గాన సభ ఆధ్వర్యంలో జరుగుతున్న డాక్టర్ కేవీ రమణాచారి జన్మదిన వేడుకలు సోమవారం పలు కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా మిమిక్రీ, మ్యాజిక్, మైమ్ కళా ప్రదర్శనలతో పాటు మాధవీ శర్మ, అనీల శిష్య బృందం నృత్య ప్రదర్శన ఆహూతులను ఆకట్టుకుంది. ఈ సందర్భంగా కేవీ రమణాచారి మాట్లాడుతూ.. త్యాగరాయ గానసభ మన సరస్వతి నిలయమని అన్నారు. ఇక్కడికి వస్తే దైవ సన్నిధిలో ఉన్న భావన కలుగుతుందని అన్నారు. భారత రాష్ట్రపతి కార్యాలయంలో అధికారిగా కన్నా టీటీడీ కార్యనిర్వహణ అధికారిగా ఎంచుకోవటంతో సంతోషంగా ఉందన్నారు. ఎందరో కళాకారులకు సేవ చేసే భాగ్యం లభించిందన్నారు. గానసభ అధ్యక్షుడు కళా జనార్దనామూర్తి మాట్లాడుతూ.. రమణాచారి జన్మదినాన్ని పురస్కరించుకొని ప్రతి ఏడాది ఫిబ్రవరి నెల మొత్తం కళాకారులను ప్రోత్సహిస్తూ వివిధ కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని అన్నారు. ఫిబ్రవరి నెల మొత్తం కళాకారులకు పండగలా ఉంటుందని అన్నారు. నటుడు జేన్నీ మాట్లాడుతూ.. గురువులు కళా ప్రక్రియ విద్య నేర్పితే రమణాచారి నీరుపోసి మడికట్టి పెంచి ఎదుగుదలకు కారణమయ్యారని అన్నారు. ఈ కార్యక్రమంలో వ్యక్తిత్వ వికాస నిపుణులు జీఎస్ఎన్ రాజు, సాహిత్య రచయిత చొక్కాపు రమణ, కార్యక్రమ నిర్వహకుడు మల్లం రమేష్ తదితరులు పాల్గొన్నారు.



కేవీ రమణాచారిని సత్కరిస్తున్న జనార్దనామూర్తి, ఆర్‌సీఎం రాజు,చొక్కాపు రమణ, జెన్నీ

సమస్యల పరిష్కారానికి కృషి

అంబర్‌పేట: డివిజన్ ప్రజల నీటి అవసరాలను తీర్చేందుకు తనవంతు కృషి చేస్తానని అంబర్‌పేట కార్పొరేటర్ విజయకుమార్‌గౌడ్ తెలిపారు. సోమవారం డివిజన్‌లోని ప్రేమ్‌నగర్‌లో ఏర్పాటు చేసిన పవర్‌బోర్‌ను కార్పొరేటర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ సహకారంతో ప్రజల అవసరాల మేరకు తన పవర్ బోర్‌ను ఏర్పాటు చేసినట్లు కార్పొరేటర్ వెల్లడించారు. డివిజన్‌లో మౌలిక సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో జలమండలి అధికారులు, బీఆర్ఎస్ నాయకులు సిద్ధార్థ ముదిరాజ్, మహేశ్ పాల్గొన్నారు.

సమగ్ర సర్వే నివేదికలో బీసీలకు అన్యాయం

కాచిగూడ: రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన సమగ్ర కుటుంబ సర్వే నివేదికలో బీసీలకు పూర్తి అన్యాయం జరిగిందని జాతీయ బీసీ మహాసభ అధ్యక్షుడు రాజేందర్ పటేల్ విమర్శించారు. సోమవారం కాచిగూడలోని మహాసభ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. 2014లో బీఆర్ఎస్ ప్రభుత్వం చేపట్టిన సర్వేలో రాష్ట్రంలోని బీసీల జనాభా 52శాతంగా ఉంటే ప్రస్తుత ప్రభుత్వ సర్వేలో 46.25 శాతానికి తగ్గించి చూపించారని మండిపడ్డారు. రాష్ట్రంలో 54శాతం ఉన్న బీసీలు విద్య, ఉద్య, ఉద్యోగ, రాజకీయ రిజర్వేషన్లకు గండికొట్టాలనే కుట్రలకు పాల్పడుతున్నారని ఆరోపించారు. కామారెడ్డి బీసీ డిక్లరేషన్ హామీలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ బీసీలను మోసం చేసిందని పేర్కొన్నారు.

కేజ్రీవాల్‌పై వచ్చిన అవినీతి ఆరోపణలు నిరూపించాలి

సుందరయ్యవిజ్ఞానకేంద్రం: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ఆరు నెలల్లో కేజ్రీవాల్‌పై వచ్చిన అవినీతి ఆరోపణలు నిరూపించాలని లేదంటే బీజేపీని గద్దె దించే దాకా పెద్ద ఎత్తున పోరాటం చేస్తామని తెలంగాణ ఆప్ రాష్ట్ర కన్వీనర్ డాక్టర్ దిడ్డి సుధాకర్ అన్నారు. సోమవారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో పార్టీ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో జహీరాబాద్, మెదక్ జిల్లాల నూతన సభ్యుల చేరిక కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆయన నాయకులకు పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. కార్యక్రమంలో నాయకులు డా.సాల్‌మన్‌రాజు, రాజశేఖర్, రాములుగౌడ్, డా.అన్సారీ, డా.లక్ష్మీనాయుడు, దర్శనం రమేష్ పాల్గొన్నారు.

ట్యాంకర్ ఢీకొని కార్పెంటర్ మృతి

కాచిగూడ: వాటర్ ట్యాంకర్ ఢీకొని ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటన నారాయణగూడ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. ఇన్‌స్పెక్టర్ చంద్రశేఖర్ తెలిపిన వివరాల ప్రకారం... చెంగిచెర్లకు చెందిన విఠల్ కుమారుడు జగన్నాథాచారి (50) పని కోసం పల్సర్ బైక్‌పై నారాయణగూడ మీదుగా అబిడ్స్ వెళ్తున్నాడు. వాటర్ ట్యాంకర్ జగన్నాథాచారిని ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. ట్యాంకర్ డ్రైవర్‌ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా మార్చురికి తరలించారు. అతని కుమారుడు భార్గవాచారి ఫిర్యాదు మేరకు పోలీసు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పర్యావరణ పరిరక్షణకు మొక్కలు నాటాలి

ప్రపంచ పర్యావరణ సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ సీహెచ్ భద్ర



పర్యావరణ పరిరక్షణపై విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న డా. సీహెచ్ భద్ర

కాచిగూడ: పర్యావరణ పరిరక్షణ దైవ సంరక్షణతో సమానమని ప్రపంచ పర్యావరణ సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ సీహెచ్ భద్ర అన్నారు. ఈ మేరకు సోమవారం సంస్థ కార్యదర్శి నిఖిల్ సాయి కోనేటి, ఉపాధ్యక్షుడు మిట్టపల్లి రామకృష్ణలతో కలిసి ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ వ్యాప్తంగా పాఠశాలలు, గురుకులాల ప్రాంగణంలో విద్యార్థులకు పర్యావరణంపై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పర్యావరణ పరిరక్షణ కోసం విద్యార్థులచే ప్రతిజ్ఞ చేయిస్తూ వారితో మొక్కలు నాటి పెంచే విధంగా కృషి చేస్తున్నామని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ పర్యావరణ పరిరక్షణ కోసం మొక్కలు నాటి పెంచాలన్నారు. కాలుష్య నియంత్రణకు కృషి చేయాలని కోరారు. ఈ సందర్భంగా విద్యార్థులకు నిర్వహించిన వ్యాసరచన పోటీలలో గెలుపొందిన వారికి బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో సంస్థ చైర్మన్ డాక్టర్ హరి ఇప్పనపల్లి, డాక్టర్ ఏ.జోష్టరావు, హరీష్, దయానంద్‌రావు, రిజ్వాన్ అహ్మద్, ఆర్.వినోద్‌రెడ్డి, రామకృష్ణ, శంకర్, నాగభూషణంచారి తదితరులు పాల్గొన్నారు.

చిలుకూరు బాలాజీ ప్రధానార్చకుడిపై దాడి దురదృష్టకరం

టీపీసీసీ సేవాదళ్ మాజీ చీఫ్ ఆర్గనైజర్ పొన్నాడ సుబ్రహ్మణ్యం



నల్లకుంట: చిలుకూరు బాలాజీ దేవాలయం ప్రధాన అర్చకుడు సీఎస్.రంగరాజన్‌పై జరిగిన దాడిని టీపీసీసీ సేవా దళ్ మాజీ చీఫ్ ఆర్గనైజర్ పొన్నాడ సుబ్రహ్మణ్యం ఖండించారు. ఇది దురదృష్టకరమని, ధర్మ పరిరణపై దాడిగా భావిస్తున్న తమ కాంగ్రెస్ ప్రభుత్వం కుట్ర వెనుక దాడి ఉన్న రహస్యాన్ని నిగ్గు తేలుస్తుందన్నారు. ఈ ఘటనపై ప్రభుత్వంపై బురదజల్లేందుకు కొందరు తమ స్వార్థ రాజకీయ ప్రయోజనాలకు వాడుకుంటున్నారని ఆరోపించారు. అర్చకుడు రంగరాజన్ తండ్రి సీఎస్ సౌందరరాజన్, దేవాలయ చైర్మన్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన మోయినాబాద్ పోలీసులు రామరాజ్యం పేరుతో ఓ సంస్థను నడుపుతూ ఈ దాడికి పాల్పడిన ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి చెందిన వీర రాఘవరెడ్డిని ఇప్పటికే అరెస్టు చేశారని తెలిపారు. రాష్ట్రంలో శాంతిభద్రతల సమస్యలు సృష్టించి, అభివృద్ధిని అడ్డుకునేందుకు కొన్ని దుష్టశక్తులు కుట్రలు పన్నుతున్నాయని ఆరోపించారు. ఇలాంటి కుట్రలను తమ ప్రభుత్వం తిప్పి కొడుతుందన్నారు. ఈ ఘటనను టీపీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్ దృష్టికి తీసుకెళ్తామని చెప్పారు. ప్రభుత్వాన్ని అప్రతిష్టపాలు చేసేలా శాంతి భద్రతలకు విఘాతం కలిగించే కుట్రలు పన్నుతున్నారని విమర్శించారు. అలాంటి వారి పట్ల రాష్ట్ర ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఆయన కోరారు.

కేంద్ర బడ్జెట్‌ను సవరించే వరకు పోరాడతాం

రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సాగర్

సుందరయ్యవిజ్ఞానకేంద్రం: కార్పొరేట్ శక్తులకు అనుకూలంగా ఉన్న కేంద్ర బడ్జెట్‌ను సవరించే వరకు ఐక్య ఉద్యమాలు నిర్వహించాలని తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి.సాగర్ పిలుపునిచ్చారు. సోమవారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో రైతు సంఘం ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో సాగర్ మాట్లాడుతూ... కేంద్ర ప్రభుత్వం పార్లమెంటులో ప్రవేశపెట్టిన బడ్జెట్ అదానీ, అంబానీలకు మేలు చేసే విధంగా ఉందని విమర్శించారు. రైతులు, వ్యవసాయ కూలీలు, కార్మికులు, దళితులు, గిరిజనులు, బలహీనవర్గాలు, మహిళలకు వ్యతిరేకంగా బడ్జెట్‌ను ప్రవేశపెట్టారని విమర్శించారు. ఉద్యోగులకు పన్ను మినహాయింపులు ఇస్తున్నామని తెలంగాణ నుంచి ఎన్నికైన కేంద్ర మంత్రులు గోరంతను కొండతలు చెప్పుకునే ప్రయత్నం చేస్తున్నారని అన్నారు.

◆ వాస్తవంగా ఉద్యోగులకు 30శాతం పన్ను విధించి కార్పొరేట్ల నుంచి మాత్రం 22శాతం పన్ను మాత్రమే వసూలు చేస్తున్నారని ఆరోపించారు. కార్మికుల కనీస వేతనాల గురించి పట్టించుకోవడం లేదన్నారు. రైతుల ఆత్మహత్యల పరంపరను నివారించేందుకు చర్యలు తీసుకోవటం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు పి.జంగారెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ప్రొ. హరిబండి ప్రసాదరావు, సహాయ కార్యదర్శి మూడ్ శోభన్‌నాయక్, బొంతు రాంబాబు, మాదినేని రమేష్, నాగేశ్వర్‌రావు, అన్నవరపు సత్యనారాయణ, మటూర్ బాలరాజ్ తదితరులు పాల్గొన్నారు.



సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో జరిగిన రైతు సంఘం సమావేశంలో మాట్లాడుతున్న సాగర్